

హరితిలక్‌సింగ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

- ఎంపీ ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలలు ఫీజులు, డొనేషన్ల రూపంలో లక్షలు వసూలు చేస్తూ తల్లిదండ్రులను నానా ఇబ్బందులు పెడుతున్నారని వాటిని ప్రభుత్వం కట్టడి చేయాలని ఆయన కోరారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన హరితిలక్‌సింగ్‌ను బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ నగరంతో పాటు జిల్లాలకు కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు విస్తరించాయని అక్రమంగా డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కాలేజీలు ప్రభుత్వ నియమ నిబంధనలకు తూట్లుపొడిచి ఇష్టం వచ్చినట్లు కాలేజీలను ఏర్పాటు చేస్తున్నారని వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో 3 కే వాక్‌థాన్ నిర్వహిస్తున్న టీ ఎక్స్ ఆస్పత్రి డైరెక్టర్లు

అధిక రక్తపోటుపై జాగ్రత్తలు తీసుకోవాలి

- టీ ఎక్స్ ఆస్పత్రి డైరెక్టర్లు

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటుపై జాగ్రత్తలు తీసుకోవాలని టీ ఎక్స్ ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ కీర్తికర్‌రెడ్డి, డాక్టర్ దీపక్‌రాజు, డాక్టర్ రవీంద్రరాంరెడ్డిలు తెలిపారు. ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్లక్ష్యం చేస్తే అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొవల్సి వస్తుందన్నారు. శనివారం కాచిగూడలో టీ ఎక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 3 కే వాక్‌థాన్ రన్ నిర్వహించి ప్రజలకు రక్తపోటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ సుమిత్‌సిన్హా, డాక్టర్ దీపక్ సహ, డాక్టర్ శశి, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ అవినాష్‌దాల్, డాక్టర్ సోహేల్ సయ్యద్, డాక్టర్ చంద్రకాంత్, శ్రీకాంత్, నవ్య తదితరులు పాల్గొన్నారు.



కాలిగ్రఫీ శిక్షణ పొందిన విద్యార్థులు

జీవీఆర్ కరాటే అకాడమీలో ముగిసిన కాలిగ్రఫీ శిక్షణ

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో 15 రోజుల పాటు సాగిన కాలిగ్రఫీ శిక్షణ శనివారంతో ముగిసింది. పదేళ్ల వయసు నుంచి 15 ఏళ్ల వయసు గల విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్, బాల్ బాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వేమూరి తాండవ కృష్ణ, జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్. జీ.ఎస్. గోపాల్‌రెడ్డి శిక్షణ పొందిన 45 మంది బాలబాలికలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. నేటి కంప్యూటర్ యుగంలో చేతితో రాస్తే జ్ఞాపక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యకరంగా ఉంటారని వారన్నారు. కార్యక్రమంలో అకాడమి మాస్టర్లు శ్యామ్‌కుమార్, అమృతారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలి

- కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ నింబోలి అడ్డలో లాల్‌బహదూర్ హైస్కూల్ పక్కన సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కాంట్రక్టర్‌ను ఆదేశించారు. పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు మల్లికార్జున్, ఆర్.సంతోష్, రమాదేవి, వరలక్ష్మి, రవియాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నింబోలిఅడ్డలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి



బాపునగర్ నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

బాపునగర్ నాలా పనుల పరిశీలన

అంబర్‌పేట, మే 18 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ బాపునగర్‌లో చేపట్టిన నాలా నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ శనివారం పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు నాలా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ గొడవలో ముగ్గురిపై కేసు

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌లో జరిగిన గొడవలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కాచిగూడ సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. నింబోలి అడ్డ ప్రాంతానికి చెందిన బాలాజీ కుమారుడు సచిన్ అదే ప్రాంతానికి చెందిన శ్రవణ్ పుట్టిన రోజు వేడుకకు హాజరయ్యాడు. రాత్రి కావడంతో కూల్ డ్రింక్స్ తెచ్చుకోవడానికి కృష్ణానగర్ వైపు వెళ్లారు. అక్కడ రోడ్డుపైఉన్న స్థానికులైన నిఖిల్, మోతిన్, ఇమ్రాన్‌లు ఇటువైపు ఎందుకువచ్చావంటూ సచిన్‌తో గొడవ పడ్డారు. దీంతో సచిన్ కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. గొడవకు కారణమైన ముగ్గురిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు.

24న సమాచార భారతి ఆధ్వర్యంలో నారద జయంతి

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): సమాచార భారతి ఆధ్వర్యంలో ఈ నెల 24న నారద జయంతి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. రెడ్‌హిల్స్ ఫ్యాప్సీ భవన్‌లో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. పాత్రికేయ రంగంలో విశేష సేవలందిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, ఫొటో గ్రాఫర్లు, యువ మహిళా జర్నలిస్టులకు, కాలమిస్టులకు నారద పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఏపీ విశ్రాంత చీఫ్ సెక్రటరీ ఐ.వై.ఆర్. కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు.

తాగునీరు కలుషితం

- మంచినీటి ట్యాంక్, బోరింగ్‌లోకి కలుషితనీరు
- సాయిదీప్ అపార్ట్‌మెంట్ వాసుల అవస్థలు
- డ్రైనేజీ మ్యాన్‌హోల్ తొలగించాలని డిమాండ్

రాంనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): జలమండలికి డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండి ఆ నీరు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌కు చెందిన మంచినీటి ట్యాంక్, బోరులోకి వస్తుండడంతో నెల రోజులుగా ఆ అపార్ట్‌మెంట్‌వాసులు ట్యాంకులోని కలుషితనీరు, బోరింగ్ నీటిని వాడుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నీటిని వినియోగించిన కొద్ది మంది వృద్ధులు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరారు. ఈ సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని అపార్ట్‌మెంట్ వాసులు వాపోతున్నారు. డీడీ కాలనీ జలమండలి సెక్షన్ పరిధిలోని తిరుమలనగర్‌లోని సీపీఎల్ మెయిన్ రోడ్డు ఎదురుగా ఉన్న సాయిదీప్ అపార్ట్‌మెంట్‌వాసులు కొంత కాలంగా కలుషిత నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన మంచినీటి ట్యాంక్, బోరులోకి అపార్ట్‌మెంట్ ముందు ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండి ఆ నీరు అపార్ట్‌మెంట్‌లోని మంచినీటి ట్యాంకు, బోరు బావిలోకి వస్తుంది. దీంతో అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న 13 కుటుంబాల వారు, పలు షాపుల యజమానులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బోర్ నీరు కూడా ఇతర గృహోపకరణలకు కూడా వాడలేని విధంగా కలుషితమై వస్తున్నాయి. తాగునీటికి వాటర్ క్యాన్స్ కొనుగోలు చేస్తున్నారు. ఇతర అవసరాల కోసం ప్రైవేట్ ట్యాంకర్లతో నీటిని తెప్పించి వినియోగించుకుంటున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అపార్ట్‌మెంట్‌వాసులు కోరుతున్నారు.





సాయిదీప్ అపార్ట్‌మెంట్ మంచినీటి ట్యాంకులోకి వచ్చిన డ్రైనేజీ నీరు, నిండిన మ్యాన్‌హోల్

అపార్ట్‌మెంట్ ముందు ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను శాశ్వతంగా మూసివేస్తే తమ అపార్ట్‌మెంట్‌కు చెందిన మంచినీటి ట్యాంకు, బోరింగ్‌లోకి మురుగునీరు రాకుండా ఉంటుందని అపార్ట్‌మెంట్ వాసులు అంటున్నారు. మ్యాన్‌హోల్ తొలగించాలని గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా దీనికి ప్రత్యామ్నాయంగా కొంత దూరం మ్యాన్‌హోల్‌ను నిర్మించారు కానీ ఈ మ్యాన్‌హోల్‌ను నూతన మ్యాన్‌హోల్‌కు కలుపకపోవడం వల్ల ఈ కలుషిత నీరు సమస్య వస్తుందని అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కలుషిత నీటిని చూపిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు రాజేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి

సమస్య పరిష్కారానికి చర్యలు

సాయిదీప్ అపార్ట్‌మెంట్‌లో నెలకొన్న కలుషిత నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండి అందులో నుంచి కలుషిత నీరు అపార్ట్‌మెంట్‌లో మంచినీటి ట్యాంకు, బోరింగ్‌కు చేరుతుంది. ఇందుకు కారణమవుతున్న మ్యాన్‌హోల్‌ను మూసివేసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

\- రోహిత్, జలమండలి మేనేజర్

కనులపండువగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి

చిక్కడపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం సీతారామ కల్యాణ మండపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన తదితర కార్యక్రమాలు జరిగాయి. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింగారపు రమేష్, చేపూరి లక్ష్మణ్, అదనపు కార్యదర్శి అమురబాలకుమార్, కోశాధికారి చిట్టిమిళ్ల శ్రీనివాస్ కార్యక్రమానికి పర్యవేక్షణ నిర్వహించారు. మహిళలు, సంఘం సభ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు.



వేడుకలలో ఆర్యవైశ్య మహిళలు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...

రాంనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు శనివారం రాంనగర్ డివిజన్‌లోని పవిత్రనగర్‌లోని ఆర్యవైశ్య భవనం వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పూజ లు, కుంకుమార్చన, నవగ్రహ పూజ, అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రాంనగర్ ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం నేతలు వెనిశెట్టి అరుణ కుమార్, నేతి మహేశ్వరి, ఎర్రం రాణి, శ్యామల అపర్ణ, చంద అనిత, సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గుప్తా, నాయకులు చల్ల శివకుమార్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, రఘురాములు గుప్తా, రామనాథం గుప్తా, వాడకట్టు రాజు, చామల శ్రీనివాస్, ఆంజనేయులు గుప్తా, సత్యవర్దన్ తదితరులు పాల్గొన్నారు.



జలమండలి డీజీఎం మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రవిచారి

డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

- కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని పలు బస్తీలలో నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని చిలకలగూడ జలమండలి డీజీఎం మోహన్‌రావుకు కార్పొరేటర్ కె. రవిచారి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని హరినగర్ చౌరస్తా, మేదరబస్తీ తదితర బస్తీలలో దెబ్బతిన్న పురాతన డ్రైనేజీ వ్యవస్థ తొలగించి నూతన డ్రైనేజీ లైన్ వేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. నూతన లైన్ల ఏర్పాటుకు ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే చర్యలు చేపడతామని జలమండలి డీజీఎం మోహన్‌రావు హామీ ఇచ్చినట్లు రవిచారి తెలిపారు.



రోడ్డుపై నిలిచిన నీటిని తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

రాంనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయం అయ్యాయి. జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ సిబ్బంది రోడ్లపై నిలిచిన నీటి తొలగింపు చర్యలు చేపట్టారు. బాగ్‌అంబర్‌పేటలో తదితర ప్రాంతాల్లో నిలిచిన వరద నీటి సమస్యను కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి పరిశీలించి జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ సిబ్బందిని రప్పించి నీటి తొలగింప చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

'పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీని తీసుకురావాలి'

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీని తీసుకురావాలని కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ దళిత్ ఇండస్ట్రీ నేషనల్ చైర్మన్ రాజశేఖర్ ఎర్రతోట డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ పాలసీని తీసుకువస్తే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అభివృద్ధి చెంది నిరుద్యోగ సమస్య పరిష్కారం కావడమేగాక, మెరుగైన ఉపాధి లభిస్తుందని అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈడీ చట్టాన్ని గత ప్రభుత్వం ఉల్లంఘించి, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. 9 ఏళ్లలో కేవలం 412 కోట్లను మాత్రమే కేటాయించి గత ప్రభుత్వం ద్రోహం చేసిందని విమర్శించారు. భూదాన్ పోచంపల్లిలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఈ విద్యా సంవత్సరంలోనే అడ్మిషన్లు ప్రారంభించాలని కోరారు. సమావేశంలో దళిత్ ఇండస్ట్రీ ప్రతినిధులు ప్రశాంత్, లక్ష్మణ్, తిరుపతయ్య, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రహరీ నిర్మాణం పూర్తి

చిక్కడపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ భవనం ప్రహరీ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. గతంలో ప్రహరీ కూలిపోయింది. పక్కనే హుస్సేన్‌సాగర్ కాలువ ఉండడంతో విష పు పురుగులు గ్రంథాలయంలోకి వచ్చే ప్రమాదం ఉండడంతోపాటు లైబ్రరీకి రక్షణ కూడా కరువైంది. గ్రంథాలయం ఆవరణలో వందలాది మంది పోటీపరీక్షల అభ్యర్థులు చదువుకుంటుంటారు. ఈ క్రమంలో లైబ్రరీ అభివృద్ధిపనుల్లో భాగంగా ప్రహరీ నిర్మాణం పూర్తిచేశారు. గ్రంథాలయం కుడి ప్రక్కన నేలంతా కంకర, సిమెంట్‌తో చదునుచేశారు. దీంతో పోటీపరీక్షలకు చదువుకునే నిరుద్యోగ యువత ఇక్కడ చెట్టుకింద కూర్చుని సేదదీరుతున్నారు.

ఔత్సాహిక గాయనీగాయకుల కృషి అభినందనీయం

చిక్కడపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక గాయనీగాయకుల కృషి అభినందనీయమని ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథ రావు అన్నారు. శనివారం కృష్ణవేణి ఆర్ట్స్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో సినిమా గీతాల ఆలాపన జరిగింది. గాయనీగాయకులను అభినందించిన త్రినాథరావు మాట్లాడుతూ తమ గానంతో శ్రోతలను ఆనందింపచేస్తున్న గాయనీగాయకుల కృషి ప్రశంసనీయమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి గెలవడానికి బీజేపీ కుట్ర

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

కవాడిగూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఇప్పటి వరకూ జరిగిన సాధారణ 2024 ఎన్నికల్లో బీజేపీ, ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడానికి స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న ఈవీఎం మిషన్‌లలో ఓటర్లు ఇచ్చిన తీర్పును తారుమారు చేయడానికి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్రకు పాల్పడుతుందని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. శనివారం నగరంలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం ద్వారా మరోకసారి బీజేపీ ఎంపీ స్థానాలను గెలిపించుకోవడం కోసం ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారని ఆయన విమర్శించారు. బీజేపీ 400 ఎంపీ సీట్లను సాధించుకోవడం ద్వారా డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ సమతా రాజ్యాంగాన్ని రద్దు చేసి మనువైదిక మాఫియా ఫాసిస్టు రాజ్యాంగాన్ని తీసుకురావడానికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ చర్యలకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. సమావేశంలో నాయకులు హనుమంతు, గోలి నరేష్, ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ జలమండలి మేనేజర్‌గా సురేష్

ముషీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో ముషీరాబాద్‌లో మంచినీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముషీరాబాద్ జలమండలి మేనేజర్ సురేష్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ ముషీరాబాద్ సెక్షన్ నూతన మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను ముషీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫర్వేజ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పు డు పరిష్కరిస్తూ నీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తమ దృష్టికి తీసుకువస్తే వటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజర్వాయర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



మేనేజర్ సురేష్, డీజీఎం మోహన్‌రాజును సన్మానిస్తున్న సయ్యద్ ఫర్వేజ్

ఈదమ్మ దేవాలయంపై కూలిన చెట్ల కొమ్మలు

ముషీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని ప్రసిద్ధిగాంచిన ఈదమ్మ దేవాలయంపై చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దేవాలయానికి ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలు విరిగి ఆలయం రేకుల షెడ్డుపై పడ్డాయి. ఆలయానికి వచ్చే భక్తులు చెట్ల కొమ్మలు తమపై పడతాయని ఆందోళన చెందుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే స్పందించి విరిగిపడ్డ చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆలయంపై పడిన చెట్ల కొమ్మలు

గ్రేటర్ రోడ్లపై ఆర్టీసీ డ్రైవర్లు రయ్ రయ్

- ర్యాష్ డ్రైవింగ్‌తో వాహనదారులను హడలెత్తిస్తున్న వైనం
- ఉదయం, రాత్రి వేళల్లో వేగంగా దూసుకెళ్తున్న బస్సులు
- సిబ్బంది పనితీరుపై ఆకస్మిక తనిఖీలకు ఉన్నతాధికారుల చర్యలు

హైదరాబాద్‌సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ రోడ్లపై కొందరు ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ర్యాష్‌డ్రైవింగ్‌తో దూసుకుపోతూ వాహనదారులను హడలెత్తిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో ప్రధాన రహదారులపై ర్యాష్ డ్రైవింగ్‌తో బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రయాణికులు బస్సులు దిగకముందే ముందుకు కదలడంతో బస్సుల నుంచి దిగలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, స్టాపుల వద్ద అతి వేగంగా బస్సులను నడుపుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ 2,800 బస్సులతో రోజూ 30 వేల బస్సు ట్రిప్పులు నడుపుతోంది. ప్రధాన రహదారులపై ఉదయం ట్రాఫిక్ తక్కువగా ఉండటంతో కొందరు డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆపకుండా వెళ్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రద్దీ సమయాల్లో బస్టాపుల్లో బస్సులను ఆపకుండా రోడ్ల మధ్యలో నిలపడం వల్ల వెనుకవచ్చే వాహనదారులు బస్సులకు తాకి ప్రమాదాలకు గురవుతున్నారు.

గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, జూబ్లీహిల్స్, ఉప్పల్, ఈసీఐఎల్, కొండాపూర్, జీడిమెట్లతోపాటు శివారు ప్రాంతాల్లో ఉదయం వేళల్లో కొందరు డ్రైవర్లు అతివేగంగా బస్సులు నడుపుతున్నారంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులను ఆర్టీసీ సీరియస్‌గా పరిగణిస్తుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఈడీ స్థాయి అధికారులతోపాటు డిపో మేనేజర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. బస్టాపులో బస్సులు నిలపకపోయినా, వేగంగా బస్సులు నడిపినా బస్సు నంబర్, సమయపాలన వివరాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

పెయింటింగ్ పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

కవాడిగూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): పెయింటింగ్ పనికి వెళ్లి ఓ వ్యక్తి అదృశ్యమయిన సంఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కవాడిగూడ సోమప్పమఠంలో నివాసం ఉండే రత్నం(43) వృత్తిరీత్యా పెయింటర్. 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. రత్నం మద్యానికి బానిస కావడంతో అతని భార్య మూడు సంవత్సరాల క్రితమే పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 4వ తేదీ పెయింటింగ్ పనికి వెళ్తున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదు. రత్నం కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. రత్నం అన్నయ్య యాదగిరి శనివారం గాంధీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పీఎస్‌లో లేదా 8712660140 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.



రత్నం